# విగత జీవులు

శ్రీ అయపిళ్ల రామారావు

★

[సంఘాన్ని సంస్కరించాలనీ చట్టాలనిసవరించాలనీ బయలుదేరే భారతసోదర సోదరీమణులదృష్టి సరవడిలాంటి దీనులవైపుకూడా మళ్లించాలని నా ఉద్దేశం. ఎందరు భారతీయు లీస్థితిలో ఉన్నారో వీధుల్లోకిపోయ్యే ప్రతివ్యక్తికీ అనుభవమే.]

చీకటి చీకటిగావుంది. చలికాల మవటం చాత కాబోలు ఇంకా వీధులలో జన సంచారం ఆట్టేలేదు. చిన్న చినుకులు కూడా పడుతూన్నాయి. శీజ్జగాలి విపరీతంగావుంది.

♦ ♦ ♦

రోడ్డుమీద నడుస్తూన్న ప్రతీవ్యక్తి, ఏదో ఒక రకం శాలువో, కంబళీయో, వులెన్ బాడీవో ధరించే ఉన్నారు. అల్లాంటి సమయంలో సగం కప్పులు ఎగిరి పోయి అక్కడక్కడ గోడలు జారిపోతూన్న చిన్న గుడిశలో కూచున్నాడు సరవడు తల్లిలేని తన యేకైక పుత్రిక పైడితో. తను దృఢంగావున్న రోజులలో, తనూ భార్యాకలిసి కూలోనాలో చేసి దైనిక జీవనాన్ని గడుపుతూండేవాళ్లు. లేక లేక ఒక్క ఆడపిల్ల కలిగిందా కష్టజీవులకి, ఆపిల్లపేరే పైడి పైడికిమూడో యేడు రాకముందే సరవడికి పక్షవాతం జబ్బువల్ల కాలూ చెయ్యీ పడిపోయాయి. "కూలడితేగాని కుండాడదు" అనేపరిస్థితుల్లో ఉన్న సరవడికిచిక్కులు ప్రారంభమయ్యాయి. అవన్నీ భరించలేక కాబోలు సరవడి పెళ్ళాం కాలం చేసింది. అప్పటినుంచి యిప్పటి వరకూ సరవడికీ, పైడికీ జీవనాధారం బిచ్చమే.

♦ ♦ ♦

పైడి కిప్పుడు పధోయేడు. తండ్రి బిచ్చమెత్తి తెచ్చే కాసిన్ని బియ్యం ఉడికించి మధ్యాహ్నం తిని రాత్రి తనూ తండ్రీ వీధుల్లో "మాధాకోళవమ్మా" అని ఎంత కఠిన హృదయాన్నైనా ఒక్క త్రుటికాలం "అయ్యో! పాపం" అనిపించే స్వరంతో అరుచుకుంటూ వీధులలో తిరుగుతూండేవారు. ఎవరైనా పుణ్యాత్ములు పిల్లలు పారేసిన అన్నపు పెళ్లలో, కుక్క ముట్టుకున్న చద్దన్నమో పెడితే "నాతల్లి నాతల్లి" అంటూ పొంగి పోయి కాస్త మరునాటి ఉదయానికి దాచుకుని తక్కింది తినేయటం. ఆశిథిలా వస్థలో వున్న యింట్లో తలదాచుకోవటం ఆ నిర్భాగ్యుల దినచర్య.

తొలినాటి రాత్రి ఆదురదృష్టవంతులికి ఎన్ని వీధులు తిరిగినా పట్టెడన్నమేనా పెట్టే పుణ్యాత్ము లేక పోయారు. పాపం! యెల్లాగో ఆరాత్రి గడిపేశారా గుడిశలో.

♦ ♦ ♦

చలి విపరీతంగావుంది. చినిగిపోయి చెమ్మగా వున్న గోనిగుడ్డ—పాపం ఏపెంటమీద దొరకిందో— కప్పుకుని ఆకలితో మాడుతూన్న ముఖంతో కాలూ చెయ్యీ స్వాధీనములో లేక శల్యావశిష్టమై వున్న తండ్రీముఖం వైపు చూసింది పైడి. ఒక్కసారి ఆకాశం వైపు చూసింది నిరాశతో. దానిఫలితంగా రెండు కన్నీటి బొట్లు వెచ్చగా సరవడి చేతిమీద పడ్డాయి. సరవడు తన పుత్రిక అవస్థను తెలిసికో గలిగాడు. లక్షల కొలదిగా మనుష్యులున్న ఆవూళ్లో తనకూతురి ఆకలిబాధ తీర్చలేక పోవుట చేతగానితనం అనుకు న్నాడు. ఆచలిగాలిలో పైమీద గుడ్డేనా లేకుండా బయలుదేరేడు సరవడు.

♦ ♦ ♦

"బాబయ్యా, దిక్కుమాలినవాడ్ని ఒక్క రాగి దమ్మిడీ పడెయ్యి బాబూ" అంటూ నుంచున్నాడొక కాఫీహోటలు గుమ్మందగ్గరగా.

"లేదుపో" అంటూ ఒకాయన అప్పుడే కాఫీ హోటలులో అయిదణాలు తినేసి పదిరూపాయిల నోటు మార్చిన చిల్లర మనీపర్సులో సర్దుతూ, వెళ్ళి పొయ్యాడు.

అంతలో ఆకాఫీ క్లబ్బు అరవ సోదరుడు కాబోలు "ఏయి పోడా, పోడా" అంటూ విప్పలిం కడిగేవాడి చేత గెంటించేసాడు తన పుట్టి మునిగినట్లు.

♦ ♦ ♦

"బాబయ్యా తమ చుట్టముక్క పాటి విలువ లేదు బాబయ్యా ఒక్క రాగిదమ్మిడి బాబూ దిక్కు లేనివాణ్ని" అంటూ చెయ్యిని చాపాడా నిరుపేద— ఒక కానీ కిళ్ళీ ఒక సిజరు శిగరెట్టు పాకెట్టు ఇవ్వ?

డంటో యిచ్చి రూపాయి దుకాణదారుడి కందిస్తూన్న వ్యక్తి వేపు.

"నీకేం బుద్ధిలేదూ పో అవతలకి" అంటూ సాగిపోయాడా మహానుభావుడు జేబులో చిల్లర డబ్బులు పడేసుకుంటూ.

♦ ♦ ♦

"బాబయ్యా" అంటూ తన గోచీగుడ్డ కొంచెం ముందుకు చాపేడు. ఒక కిరాణా దుఖాణ దారుతో

"పో పో, బేరంలేదు సారంలేదు పొద్దుటే" అన్నాడా ధర్మదాత.

♦ ♦ ♦

"అమ్మా నీకుపుణ్యం తల్లీ— యింటికాడ పిల్ల ఆకల్తో సచ్చిపోతందమ్మా—ఒక్క బియ్యపు గింజెట్టు తల్లీ" అంటూ నించున్నాడొక గుమ్మంలో

"మడిలోవున్నాను" అంటూ వీధి తలుపు బిగించేసిందా యిల్లాలు.

"అయ్యోయ్యతల్లీ దాన ధర్మాలను నీమడి ఆటంకమా" అంటూ సాగిపోయా డక్కడనుంచి.

♦ ♦ ♦

"కష్టపడలేను బాబూ ఒక్క రాగిడబ్బు దయచేయండి బాబూ" అన్నా డొక గుమ్మందగ్గర

"ఏయి, ఇది ఆఫీసనుకున్నావా, నీయిల్లనుకున్నావా పో" అన్నా డొక వకీలు తన కళ్ళద్దాల్ని సవరిస్తూ.

"ఆఫీసయి దిక్కులే నోళ్లని చూడొద్దన్నాదా, బాబా" అంటూ పోయా డక్కడనుంచి.

♦ ♦ ♦

"బాబూ నిన్నటి బట్టి తిండిలేదు రక్షించు బాబూ" అంటూ చెయ్యిచాపేడు బీచివడ్డున కూర్చొని సంఘ సంస్కారాన్ని గూర్చి చర్చిస్తూన యిద్దరు పెద్ద మనుష్యుల్ని చూసి.

పాపము వానిముఖము కేసైనా చూడలేదా మహానుభావులు. కొంచము ఆశతో కొంతకాలమోర్చి "బాబయ్యా" అన్నాడు సరవడు. యీసారి ఒకాయన సరవడి వేపు చూడకుండానే సరవడ్ని పొమ్మనిచేత్తో సంజ్ఞ చేసాడు.

♦ ♦ ♦

పగలల్లా తిరిగాడు సరవడు. ఎక్కడా పట్టెడన్నమైనా ఒక్క రాగిదమ్మిడీ అయినా యిచ్చేవారు లేక పోయ్యా రావేళ సరవడికి. వేలకు వేలు తగలేసే సినీమాహాలువద్ద కూడా సరవడి మొరలినే వాళ్లెవరూ లేక పోయారు. అంతమంది జనంలో ఒకడైనా తన కష్టాన్ని చూసేవాళ్లు లేకపోయినందుకు నిరాశా హృదయంతో దారితీసాడు గుడిశవేపు.

త్రోవలో ఒక దయామయుడు ఒక్క కానీ దానం చేసాడు సరవడికి. ఉదయాన్నుంచీ సాయంకాలం వరకూ తిరిగి వేసారిన సరవడికి ఆకానీ చూడటంతోనే పోయిన ప్రాణాలు లేచొచ్చినట్టయింది.

♦ ♦ ♦

ఒక రొట్టె చేతనుంచికొని అత్రుతగా ప్రవేశించాడా గుడిశలోకి సరవడు కూతురి ఆకలి బాధ తీరుద్దామని.

"పైడి తల్లీ" అని పిలచాడు కూతుర్ని ముద్దుగా జబాబురాలా.

"పైడీ" అని తిరుగా పిలచాడు దిక్కుమాలిన పక్షి దీపమైనా లేని ఆగుడిశలో నాలుగు మూలలా తడుముతో. అంతలో ఏమో మెత్తని పదార్థం తగిలనట్టయింది సరవడికి. క్షణంలోనే విగతజీవి అయివున్న పైడని తెలుసుకున్నాడు సరవడు. దుఃఖాన్నాపుకోలేక బారుమ నేడ్చాడు. వినేవాళ్లెవరు. ఇంతలో దఫీమని చప్పుడుతో గుడిశ తిరుగబడింది. పాపం తనముద్దు కూతురితో పాటు తేనుకూడా ఆహుతయ్యాడు మృత్యుదేవతకి సరవడు.


శక్తిమయా

శక్తి ♦ పటుత్వం ♦ ఉత్సాహం ♦

ఇస్తుంది

అన్ని మందులషాపుల్లో దొరుకుతుంది.

సూరజ్ ఫార్మసీ,

142, తిరువత్తియూరు హైరోడ్డు,

చాకలపేట, మద్రాసు.